వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, సెప్టెంబర్ 16, 2026

సంగారెడ్డిలో బైపాస్ రోడ్డు రగడ

- ఎమ్మెల్యే తీరుపై జగ్గారెడ్డి ఆగ్రహం
- కూల్చివేతలు లేకుండానే అభివృద్ధి చేస్తామని స్పష్టం
- ప్రజలకు, వ్యాపారులకు నష్టం జరగకూడదు



సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : సంగారెడ్డి బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. బిల్డింగ్‌లను కూల్చకుండా బైపాస్ రోడ్డు వేస్తామంటే, లోకల్ ఎమ్మెల్యే మాత్రం అన్ని బిల్డింగ్ లు కూల్చాలని అంటున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం సాయంత్రం సంగారెడ్డి పట్టణంలోని బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన కాలినడకన పర్యటించి రోడ్డును పరిశీలించారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డు అభివృద్ధి కోసం తాను స్వయంగా రూ. 18 కోట్ల నిధులు మంజూరు చేయించానని, అయితే పనులు జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే ఇంట్లో కూర్చొని అధికారులకు, విజిలెన్స్‌కు ఫిర్యాదులు చేస్తూ పనులు ఆపిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు.80 అడుగుల రోడ్డు కోసం సుమారు 180 భవనాలు కూల్చాల్సి వస్తుందని, అంతమందికి కోట్లలో నష్టపరిహారం చెల్లించడం ఆచరణలో సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. ఎలాంటి కూల్చివేతలు లేకుండా, బిల్డింగ్ యజమానులకు, ఫుట్‌పాత్ వ్యాపారులకు ఎలాంటి నష్టం కలగకుండా 50 అడుగుల రోడ్డును అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. దీనివల్ల ప్రజల ఇళ్లు, దుకాణాలు, మెట్లు తొలగించాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యేకి నిజంగా 80 అడుగుల రోడ్డు కావాలనిపిస్తే, నేరుగా బైపాస్ రోడ్డులోకి వచ్చి ప్రజల మధ్య కూల్చివేతలపై మాట్లాడాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఆస్తి నష్టం కలిగించడం సరికాదని, ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారి విస్తరణ చేపడతామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

చరిత్ర దాచేస్తే దాగదు

- ఎంపీ ఈటల రాజేందర్
- పెరేడ్ గ్రౌండ్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన చారిత్రక ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. సీనియర్ నాయకులు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు తో పాటు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇందులో పాల్గొన్నారు. తెలంగాణ త్యాగాల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, చరిత్రను దాచేస్తే ఎప్పటికీ దాగదని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అమరుల త్యాగాల గొప్పతనం ప్రతి విద్యార్థి, యువకుని గుండెల్లో నిలిచిపోవాలన్నారు. నిజాం కాలంలో 'వందేమాతరం' అన్నందుకు జైళ్లలో పెట్టారని, మూడు రంగుల జెండా ఎత్తినందుకు పరకాలలో 26 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాసిం రజ్వీ అరాచకాలు, ఆడపిల్లలపై జరిగిన అఘాయిత్యాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాశరథి, యాదిగిరి వంటి కవులు పాటలు రాసినందుకు, పత్రికల్లో రాసినందుకు జైలు శిక్షలు అనుభవించారని తెలిపారు. నిర్మల్ వద్ద రాంజీ గోండు నిజాం సైన్యంపై పోరాడితే ఒకే చెట్టుకు వెయ్యి మందిని ఉరితీశారని, జెల్-జమీన్-జంగల్ అంటూ కొమరం భీమ్, భూమి కోసం-భుక్తి కోసం దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, బందగీ, పవార్, గండన్న చేసిన పోరాటాలను మరువలేమన్నారు. పిల్లలకు కేవలం చదువు, ఉద్యోగాలే కాకుండా దేశభక్తిని నూరిపోయాలని, చరిత్ర లేనిదే వర్తమానం, భవిష్యత్తు లేవని ఎంపీ ఈటల రాజేందర్ ఉద్ఘాటించారు.

విపత్తుల సమయంలో ప్రాణాలు కాపాడే వారే నిజమైన 'ఆపద మిత్రులు'



అడిషనల్ కమాండెంట్ వంశీ మోహన్ రెడ్డి

మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల సమయంలో ప్రాణాలు కాపాడేవారే నిజమైన 'ఆపద మిత్రులు' అని 4వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ వంశీ మోహన్ రెడ్డి అన్నారు. మామునూరులోని 4వ బెటాలియన్ ఆవరణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కోసం ఏర్పాటు చేసిన 'యువ ఆపద మిత్ర' శిక్షణా కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించి మాట్లాడారు. విపత్తులు సంభవించినప్పుడు మొదటి 'గోల్డెన్ అవర్'లో స్పందించేలా స్థానిక యువతకు ఈ శిక్షణ ద్వారా నైపుణ్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లాకు చెందిన మొత్తం 102 మంది ఎన్ఎస్ఎస్ యువతీ, యువకులు ఈ 7 రోజుల ప్రత్యేక శిక్షణలో పాల్గొంటున్నారు. నిపుణుల పర్యవేక్షణలో ప్రాథమిక చికిత్స, సీపీఆర్, ఈత రక్షణ, అగ్నిప్రమాదాలు, వరదల నివారణ చర్యలపై ప్రాక్టికల్ శిక్షణా తరగతులు ఉంటాయి. విపత్తు వేళ భయాందోళనలకు తావివ్వకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలపై లైవ్ డెమోలు నిర్వహిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులతో పాటు విపత్తు రక్షణ కిట్లను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్యూవల్ రిఫ్రెషర్ కోర్స్ ను కూడా ప్రారంభించారు. అసిస్టెంట్ కమాండెంట్స్ బాలయ్య, వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్లు రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, కృష్ణతో పాటు బెటాలియన్ పోలీస్ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు. సమాజ రక్షకులుగా నిలవడానికి ముందుకు వచ్చిన ఈ యువత సేవలు అభినందనీయమని కొనియాడారు.

టీఆర్ఎస్ సోషల్, డిజిటల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లంపల్లి సందీప్



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) సోషల్ మీడియా, డిజిటల్ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లంపల్లి సందీప్ ని యమి తు లయ్యా రు . ఈ మేరకు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్వయంగా నియామక ఉత్తర్వుల పత్రాన్ని సందీప్‌కు అందజేశారు. తనపై నమ్మకంతో పార్టీలో కీలకమైన రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల సందీప్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను పూర్తి అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో నిర్వర్తిస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సోషల్ మీడియా, డిజిటల్ మీడియా కార్యకలాపాలను మరింత విస్తృతం చేయనున్నట్లు సందీప్ తెలిపారు. పార్టీ విధానాలు, కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యలను డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తానన్నారు. తెలంగాణవ్యాప్తంగా పార్టీ డిజిటల్ ఉనికిని బలోపేతం చేయడంతో పాటు, సోషల్ మీడియాను పార్టీ శ్రేణులకు, ప్రజలకు మధ్య అనుసంధాన వేదికగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులతో సక్రమంగా సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బొల్లంపల్లి సందీప్ తెలిపారు.

డాక్టర్ రఘు కుటుంబాన్ని పరామర్శించిన కల్వకుంట్ల కవిత



మెట్ పల్లి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జీ డాక్టర్ రఘుని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. డాక్టర్ రఘు తల్లి పుష్పలత ఇటీవల మృతి చెందడంతో, జగిత్యాల జిల్లా మెట్ పల్లిలోని వారి నివాసానికి కవిత నేరుగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పుష్పలత చిత్రపటం వద్ద పూలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

అఫిడవిట్ లో చెప్పినదానికన్నా గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తా

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తాను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న దానికన్నా గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అసెంబ్లీలో సెక్షన్ 22(ఏ)పై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబ భూముల గురించి ప్రస్తావించిన అంశంపై ఆమె 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీలో సీఎం ఎవరెవరి పేర్లు ప్రస్తావించి వారికి ఎక్కువ భూములు ఉన్నట్టుగా చెప్పారో, ఆ జాబితాలోని వారందరి భూములపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం అసెంబ్లీలో చదివితే సరిపోదని, నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. సీఎం అసెంబ్లీలో ప్రస్తావించిన గుంటనక్క, కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండే సీఎం గూఢచారితో పాటు... నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిబంధనలను అతిక్రమించి తన వద్ద ఎలాంటి అదనపు భూములు లేవని, ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నట్టు తేలినా ఆ భూములను వెంటనే ప్రభుత్వానికి అప్పగిస్తానని కుండబద్దలు కొట్టారు.